క్లుప్తంగా

పాఠశాలల్లోకి అనుమతి లేదనడం అప్రజాస్వామికం



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

పెనుకొండ: పాఠశాలల్లోకి విద్యార్థి సంఘాలు, ప్రజాస్వామ్యవాదులకు అనుమతి లేదనడం విద్యావ్యవస్థలో ప్రభుత్వ వైఫల్యాలు కప్పి పుచ్చుకోవడానికేనని ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని ఎన్‌టీఆర్ సర్కి వద్ద ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో సర్క్యులర్ కాపీలను దహనం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా అధ్యక్షులు ఈరేష్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లోకి మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, విద్యార్థుల తల్లిదండ్రులు మినహా ఎవరినీ అనుమతించరాదని పాఠశాల విద్యాశాఖ ఇచ్చిన ఉత్తర్వులు అప్రజాస్వామిక మన్నారు. ఉత్తర్వులను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. నాయకులు శ్రవణ్, అనిల్, ప్రభు, పవన్, హేమంత్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యం



ఊటుకూరులో నూతన వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ మంత్రి ఉషశ్రీచరణ్

పరిగి: మోదాలో గురువారం వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు మోహన్ సోదరుడి కుమార్తె లక్ష్మీ వివాహం హరీష్‌తో జరిగింది. మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. పాత్రగానిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత అశ్వర్థ కుమారుడు మనోజ్ వివాహం మమతతో ఊటుకూరులోని కన్యకా పరమేశ్వరీ ఆలయంలో జరిగింది. ఈ సందర్భంగా మాజీ మంత్రి నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఊటుకూరులోని ప్రముఖ సీనియర్ నాయకుడి నరేంద్రరెడ్డి, గౌతమిరెడ్డి దంపతుల గృహ ప్రవేశ కార్యక్రమానికి హాజరయ్యారు. కార్యక్రమాల్లో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నరసింహమూర్తి, నాయకులు పాల్గొన్నారు.

గుంతలు పూడ్చిన అధికారులు



గుంతకు మట్టి వేసిన దృశ్యం

అమరాపురం: మండల కేంద్రం అమరాపురం నుంచి తమ్మడేపల్లి వరకూ రోడ్డులో గుంతలు ఏర్పడడంతో పాటు వర్షం వస్తే గుంతలోకి నీరు చేరి పాదచారులు, వాహనదారులు ఇబ్బంది పడేవారు. 'ఈ రోడ్డులో ప్రయాణం చేయడం నరకం' అన్న శీర్షికన వరుసగా మంగళవారం సాక్షిలో కథనం వెలువడింది. స్పందించిన సంబంధిత అధికారులు గుంతల్లోకి కంకర వేసి వాటిని పూడ్చి వేశారు. అయితే పెద్ద గుంతలను పూడ్చారని, చిన్న గుంతలను సైతం పూడ్చాలని వాహనదారులు కోరారు. గతంలో కంటే రోడ్డు ప్రస్తుతం కాస్తా మెరుగ్గా ఉందని వాహన చోదకులు సాక్షికి కృతజ్ఞతలు తెలిపారు.

వైఎస్సార్‌సీపీ నాయకుడి మృతి



నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి వాగేష్ తదితరులు

అమరాపురం: మండలంలోని కె. శివరం గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకుడు కొండప్ప (65) అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న రాష్ట్ర వైఎస్సార్‌సీపీ సంయుక్త కార్యదర్శి వాగేష్, సర్పంచ్ మంజుల చిత్తన్న, వైస్ ఎంపీపీ క్రిష్ణమూర్తి ఆ గ్రామానికి వెళ్లి మృతదేహంపై పుష్పగుచ్ఛాలుంచి నివాళులర్పించారు. అనంతరం కుమారుడు అమరీష్‌బాబుకు ధైర్యం చెప్పారు. అలాగే వైఎస్సార్‌సీపీ నాయకులు ప్రసాద్, మారుతి, నరసింహరాజు, రసూల్ బాషా, గంగన్న, రామమూర్తి, నటరాజు, రంజిత్, బసవరాజు అబ్దుల్, రంగస్వామి తదితరులు నివాళులర్పించారు.

స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా చేయాలి

మడకశిరరూరల్: మండలంలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో శుక్రవారం స్వాతంత్ర్య దినోత్సవం ఘనంగా చేసుకోవాలని సీడీపీఓ నాగమల్లేశ్వరి తెలిపారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో గురువారం కదిరేపల్లిలో అంగన్‌వాడీ, పాఠశాల విద్యార్థులకు జాతీయ జెండా రంగులు వేయడం, రాఖీలు తయారు చేయడం వంటివి నిర్వహించారు. అనంతరం ఆమె అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. కార్యక్రమంలో సూపర్ వైజర్ లీలావతి, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రత్యామ్నాయంపై రైతుల దృష్టి

- ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ఎదురుచూపులు
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

మడకశిరరూరల్: ఈ ఏడాది వేరుశనగ పంట సాగుకు సకాలంలో వర్షాలు రాకపోవడంతో రైతులు ప్రత్యామ్నాయ విత్తన సాగుపై దృష్టి పెట్టారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు వేరుశనగ పంటను సాగు చేయడానికి రైతులు ఎవరూ ముందుకురారు. ఒక వేళ సాగు చేసినా దిగుబడి ఏమాత్రం ఉండదు. సాగు చేస్తే నష్టపోతారని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు. నియోజకవర్గంలో వేరుశనగ సాధారణ సాగు విస్తీర్ణం 34,300 హెక్టార్లు. అయితే 12,300 హెక్టార్ల విస్తీర్ణంలో బోరు బావుల కింద వివిధ పంటలను సాగు చేశారు. 11 వేల హెక్టార్లల్లో వేరుశనగ పంటను సాగు చేశారు. దాదాపు 11 వేల హెక్టార్లు బీడుగా ఉన్నాయి. ఈ క్రమంలో వేరుశనగ సాగుకు గడువు ముగియడంతో రైతులు ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారు. ఇటీవల వర్షం పడుతుండడంతో వివిధ రకాలకు చెందిన ప్రత్యామ్నాయ పంటలను రైతులు సాగు చేసుకోవడానికి సిద్ధంగా ఉన్నారు. అయితే విత్తనాల కొరత అధికంగా ఉంది. ప్రభుత్వం అందించే విత్తనాల కోసం ఎదురు చూస్తున్నారు. ప్రభుత్వం సకాలంలో విత్తనాలను అందిస్తుందో లేదో వేచి చూడాల్సి ఉంది. ఇప్పటికే కంది,అలసంద, ఉలవలు తదితర ప్రత్యామ్నాయ విత్తనాల కోసం ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని వ్యవసాయాధికారులు పేర్కొంటున్నారు. కాగా వేరుశనగ పంట సాగు చేయని వారికి ప్రభుత్వం ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలను అందించాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.



బీడుగా ఉన్న భూములు

సకాలంలో విత్తనాలు అందించాలి



ప్రస్తుతం వేరుశనగ సాగుకు గడువు అయిపోయింది. ప్రత్యామ్నాయ పంటల సాగే గతి. ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను సకాలంలో అందించడానికి చర్యలు తీసుకోవాలి. సకాలంలో అందించక పోతే రైతులకు ఎలాంటి ఉపయోగం ఉండదు. ఏమాత్రం ఆలస్యం చేయకుండా ప్రభుత్వం ప్రత్యామ్నాయ విత్తనాలను రైతులకు సరఫరా చేయాలి.

– శ్రీరామరెడ్డి రైతు, ఎల్లోటి, మడకశిర మండలం

ఉచితంగా విత్తనాలు ఇవ్వాలి



ప్రభుత్వం రైతుల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఉచితంగా ప్రత్యామ్నాయ విత్తనాలను అందించి ఆదుకోవాలి. ప్రస్తుతం వర్షాలు పడుతుండడంతో ప్రత్యామ్నాయ పంటల సాగుకు మంచి సమయం. ప్రభుత్వం ఆలస్యం చేయకుండా అర్హత ఉన్న రైతులందరికీ విత్తనాలు అందించి ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించాలి.

– తిమ్మప్ప, రైతు, ఆర్.అనంతపురం మడకశిర మండలం

మాతృభాషపై మమకారం పెంచుదాం



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: మారుతున్న కాలానికి అనుగుణంగా నేటి విద్యార్థులకు మాతృభాషపై మమకారం పెంచుదామని కవులు, రచయితలు పిలుపునిచ్చారు. గురువారం పట్టణంలోని శాఖ గ్రంథాలయంలో అఖిల భారత ఫ్రీడం ఫైటర్ షహీద్ టిప్పు సుల్తాన్ యునైటెడ్ ఫ్రంట్, ఉమర్ ఫారూఖ్ ఖాన్ ఆధ్వర్యంలో తెలుగు భాష చైతన్య పోటీలు నిర్వహించారు. దేశభక్తి, జాతీయ సమైక్యత, దేశ సుస్థిరత, మతసామరస్యం, పరమత సహనం, సోదర భావం, వసుధైక కుటుంబ నిర్మాణంపై కథలు, కవితలు, రచనలు, వ్యాసాలు, చిత్రలేఖనం, వకృత్వ పోటీల్లో 5 నుంచి పదో తరగతి విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు మండల విద్యాశాఖ అధికారి గంగప్ప, జిల్లా రచయితల సంఘం హిందూపురం అధ్యక్షుడు కల్లూరు రాఘవేంద్రరావు, ప్రముఖ న్యాయవాది ఇందాద్ చేతుల మీదుగా ప్రశంసా పత్రాలు, మెమొంటోలు అందజేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ.. తెలుగు భాషాభిమానులు ముందుకు వచ్చి విద్యార్థులకు మాతృభాషపై మమకారాన్ని పెంచే కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి విజయ కుమారి, తెలుగు ఉపాధ్యాయులు తిరుపతయ్య, ఇలాహి, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

మేకల మంద పై దూసుకెళ్లిన కారు

నాలుగు మేకల మృతి



పోలీసులు స్వాధీనం చేసుకున్న కారు

రొళ్ల: 544ఈ జాతీయ రహదారిపై గురువారం జరిగిన ప్రమాదంలో నాలుగు మేకలు మృత్యువాత పడ్డాయి. వివరాలు.. హైదరాబాదు చెందిన కొందరు కారులో మడకశిర మీదుగా కర్ణాటక రాష్ట్రం మడికేరికి వెళ్తున్నారు. మార్గ మధ్యలోని రొళ్ల మండలం కొరగార్లగుట్ట గ్రామ సమీపాన 544ఈ జాతీయ రహదారిపై అదే గ్రామానికి చెందిన రంగశామప్ప అనే కాపరి మేకల మందను తరలిస్తున్నారు. ఈ క్రమంలో అతి వేగంగా వచ్చిన కారు మేకల మందపై దూసుకెళ్లింది. ఘటనలో నాలుగు మేకలు అక్కడికక్కడే మృత్యువాత పడ్డాయి. సుమారు రూ.35వేల వరకు నష్టం జరిగిందని బాధితుడు వాపోయాడు. అయితే కారు ఆపకుండా వేగంగా వెళ్లి పోయింది. దీంతో అగళి పోలీసులకు స్థానికులు సమాచారం అందించడంతో .. అక్కడి పోలీస్ సిబ్బంది కర్ణాటక వైపు వెళుతున్న కారును అడ్డగించి అగళి స్టేషన్‌కు తరలించారు. కాగా మేకల కాపరికి కారులో వెళుతున్న వారు నష్ట పరిహారం కింద ఆర్థిక సాయం చేసినట్లు సమాచారం. ఘటనకు సంబంధించిన ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఏఎస్ఐ ఇదాయితుల్లా తెలిపారు.

కొనసాగుతున్న జేడీఎస్ ధర్నా



నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

పావగడ: పట్టణంలోని కుమారస్వామి లే అవుట్ పేరును తొలగించ కూడదని స్థానిక జేడీఎస్ నాయకులు చేపట్టిన ధర్నా గురువారం మూడో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా బీజేపీ నాయకుడు శివ ప్రసాద్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి కుమారస్వామి లే అవుట్ పేరును తొలగించి స్థానిక మాజీ మంత్రి వెంకటరమణప్ప పేరును పెట్టడం సమంజసం కాదని తీవ్రంగా ఖండించారు. కుమారస్వామి పేరునే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జేడీఎస్ నాయకులు రాజశేఖర్, రామకృష్ణారెడ్డి, రామాంజినప్ప, భరత్, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.



ర్యాలీ నిర్వహిస్తున్న వీహెచ్‌పీ నాయకులు, యువకులు

• కాగడాలతో ర్యాలీ

హిందూపురం: అఖండ భారత్ సంకల్ప దివస్ సందర్భంగా గురువారం విశ్వహిందూ పరిషత్ ఆధ్వర్యంలో కాగడాలతో ర్యాలీ చేపట్టారు. స్థానిక పొట్టి శ్రీరాములు సర్కిల్ నుంచి మెయిన్ బజార్, గాంధీ సర్కిల్ నుంచి అంబేడ్కర్ సర్కిల్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. అఖండ భారతాన్ని తిరిగి సాధించాలన్న సంకల్పాన్ని ప్రతి ఒక్కరూ గుర్తు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్వ హిందూపరిషత్ నాయకులు, యువకులు తదితరులు పాల్గొన్నారు.

మృతుడి కుటుంబానికి మాజీ మంత్రి పరామర్శ



లక్ష్మీరెడ్డి మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి శంకర నారాయణ

పెనుకొండ రూరల్: మండలంలోని గొందిపల్లికి గ్రామానికి చెందిన వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకుడు లక్ష్మిరెడ్డి(58) అనారోగ్యంతో బుధవారం రాత్రి బెంగళూరులోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ పీఏసీ సభ్యుడు మాలగుండ్ల శంకరనారాయణ గ్రామానికి చేరుకుని లక్ష్మిరెడ్డి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'అహుడా' నిధులతో గుడ్డం కోనేరు అభివృద్ధి



గుడ్డం కోనేరును పరిశీలిస్తున్న దృశ్యం

హిందూపురం టౌన్: పట్టణంలోని గుడ్డం కోనేరును అహుడా నిధులతో సమగ్రంగా అభివృద్ధి చేస్తామని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ తెలిపారు. గురువారం మున్సిపల్ కమిషనర్ మల్లికార్జునతో కలిసి కోనేరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వినాయక చవితిని పురస్కరించుకుని ప్రతి సంవత్సరం వినాయక నిమజ్జన కార్యక్రమాన్ని పుర ప్రజలు గుడ్డం కోనేరులో చేపడతారన్నారు. కోనేరు సమగ్ర అభివృద్ధి కోసం అహుడా నుంచి రూ.1.50 కోట్లు నిధులు విడుదలైనట్లు పేర్కొన్నారు. వచ్చే వినాయక నిమజ్జనానికి కోనేరును సుందరంగా తీర్చిదిద్దుతామన్నారు. అనంతరం ఎంజీఎం మైదానంలో స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు చేస్తున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు.

హర్ ఘర్ తిరంగా యాత్ర

లేపాక్షి: ప్రభుత్వ జిల్లా స్థాయి విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు గురువారం కల్లూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు హర్‌ఘర్ తిరంగా కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. విద్యార్థులు జాతీయ జెండాలు చేతపట్టుకుని నినాదాలు చేశారు. పాఠశాల యాజమాన్య కమిటీ సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

రాజణ్ణను మంత్రి పదవి నుంచి తొలగించడం అన్యాయం

పావగడ: రాష్ట్ర సహకార శాఖ మంత్రి కేఎన్ రాజణ్ణను మంత్రి పదవి నుంచి తొలగించడం అన్యాయమని, వెంటనే అతడికి మంత్రి పదవి కేటాయించాలని డిమాండ్‌చేస్తూ స్థానిక వాల్మీకి సంఘం నాయకులు, రాజణ్ణ అభిమాన సంఘాల నాయకులు గురువారం ఆందోళన నిర్వహించారు. అతిథి గృహం నుంచి వందలాది మంది జనం ర్యాలీగా తరలి శనిమహాత్మ సర్కిల్ కు చేరుకుని అనంతరం తాలూకా కార్యాలయం ఎదుట ఆందోళన చేశారు. ఈ సందర్భంగా వాల్మీకి సంజయ కుమార స్వామిజీ మాట్లాడుతూ రాజణ్ణ సహకార శాఖ మంత్రిగా మహిళా సంఘాల ఆర్థికాభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. లోకేశ్ పాళేగార్, ఈరణ్ణ మాట్లాడుతూ 50 సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేశారన్నారు. వెంటనే రాజణ్ణను మంత్రి మండలిలోకి చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం తహసీల్దార్ వరదరాజుకు వినతి పత్రం అందించారు. కార్యక్రమంలో వాల్మీకి సంఘం నాయకులతో పాటు ఇతర సామాజిక వర్గాల నాయకులు పాల్గొన్నారు.

భూగర్భ జలాల సంరక్షణ చేపట్టాలి

అమరాపురం: మండలంలో సాగునీటి సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు , డైరెక్టర్లు సంయుక్తంగా అధికారులతో కలసి భూగర్భ జలాల సంరక్షణే ధ్యేయంగా పని చేయాలని ఏఈ. భార్గవ్ సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు గురువారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వీడియో కాన్ఫరెన్స్ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు పలు అంశాలను వివరించినట్లు ఏఈ తెలిపారు. అడ్డుకట్ట లేకుండా చెరువులోకి వర్షపు నీరు చేరేలా చూడాలని సూచించారన్నారు.

చెరువుల అభివృద్ధికి కృషి చేయండి

రొళ్ల: మైనర్ ఇరిగేషన్ చెరువుల అభివృద్ధి కోసం ఆయకట్టు సంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు కృషి చేయాలని అధికారులు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో రొళ్ల, అగళి మండలాల్లోని వివిధ గ్రామాల మైనర్ ఇరిగేషన్ చెరువు ఆయ కట్టు సంఘాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులతో చెరువుల అభివృద్ధి విషయంపై సీఎం చంద్రబాబు వర్చువల్‌గా వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అవగాహన కల్పించినట్లు తహసీల్దార్ షేక్షావలి తెలిపారు.



పి.రొప్పాల-పి.కొత్తపల్లి ప్రధాన రహదారి దుస్థితి



గొబ్బరంపల్లి రోడ్డు పరిస్థితి ఇలా..

• చినుకు పడితే చిత్తడే

రొద్దం: మండలంలోని పి.రొప్పాల-పికొత్తపల్లి గ్రామాల మధ్య ఉన్న ప్రధాన రహదారి గుంతలమయమైంది. గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడానికి వాహనదారులు, గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇసుక అక్రమ రవాణాతో రోడ్డు మొత్తం ధ్వంసమైనట్లు గ్రామస్తులు వాపోతున్నారు. పెన్నానదిలో నుంచి వందల ట్రాక్టర్లు రోజూ తిరగడంతో రోడ్డు ధ్వంసమైందని వాపోతున్నారు. ఇటీవల మంత్రి సవిత పర్యటనలో సిమెంట్ రోడ్డు వేయిస్తామని హామీ ఇచ్చినా ఆచరణకు నోచుకోవడం లేదని గుర్తు చేస్తున్నారు. చిన్నపాటి వర్షానికే రోడ్డు మొత్తం బురదమయంగా మారుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గొబ్బరంపల్లిలో కూడా రోడ్డు బురదగుంటలా ఉందని గ్రామస్తులు వాపోతున్నారు.

పరామర్శ



వైఎస్సార్‌సీపీ నేత రంగప్పను పరామర్శిస్తున్న మధుమతిరెడ్డి తదితరులు

చిలమత్తూరు: హిందూపురం మండలం సింగిరెడ్డిపల్లికి చెందిన వైఎస్సార్‌సీపీ నేత రంగప్ప అనారోగ్యంతో ఆసుపత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి చౌళూరు మధుమతిరెడ్డి గురువారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. వైద్య సాయంలో ఏవైనా ఇబ్బందులొస్తే అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నేతలు నాగిరెడ్డి, మాజీ సర్పంచ్ రాజు, లోకేష్ రెడ్డి, సుధాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

దేశభక్తి గీతాల పోటీలు



పోటీల్లో గెలుపొందిన చిన్నారులు

పావగడ: 79వ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక స్త్రీ శిశు సంక్షేమ శాఖ, బాల భవన సమితి ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు గురువారం దేశభక్తి గీతాలపై పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీఓ సునీత మాట్లాడుతూ.. చిన్నారుల్లో దేశభక్తి పెంపొందించడానికి దేశ భక్తి గీతాల పోటీలు నిర్వహించామన్నారు. విద్యార్థులు పెద్ద ఎత్తున తరలివచ్చి పోటీల్లో పాల్గొన్నారు. అనంతరం పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరచిన విద్యార్థులకు బహుమతులు అందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం లక్ష్మీ నరసమ్మ, సూపర్ వైజర్ విజయలక్ష్మి, ఆదర్శ పాఠశాల హెచ్‌ఎం వెంకటేశ్, దుర్గమ్మ తదితరులు పాల్గొన్నారు.

క్షయపై అవగాహన

పుట్టపర్తి: క్షయపై విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ మక్బూల్ హుస్సేన్ సూచించారు. గురువారం ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో జిల్లా క్షయ నివారణ అధికారి అబీబ్ బాషా, వైద్య సిబ్బంది కళాశాలలో క్షయ నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ.. విద్యార్థులు క్షయపై అవగాహనపెంచుకోవాలన్నారు. వ్యాధి లక్షణాలను జిల్లా క్షయ నివారణ అధికారి వివరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.